సాక్షి ప్రకాశం

ఆదివారం । 7 । సెప్టెంబర్ । 2025



రైతులకు బాసటగా నిలుద్దాం

రైతులకు బాసటగా నిలిచేందుకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈనెల 9న ఆర్డీఓ కార్యాలయాల వద్ద 'అన్నదాత పోరు' చేపట్టినట్లు మాజీ మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు.

- 8లో..



పెళ్లికి నిరాకరించారని ఆత్మహత్య

మేనమామ కూతురిని పెళ్లి చేసుకునేందుకు వారు నిరాకరించడంతో మనస్తాపం చెందిన యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కొమరోలు మండలం గుండ్రెడ్డిపల్లిలో జరిగింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం
37 /27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వైఎం.ప్రసాద్‌రెడ్డి



వైఎం.ప్రసాద్‌రెడ్డి

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యెనుముల మారుతి ప్రసాద్ రెడ్డి (బన్ని)ని నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. జోన్–4 కింద ప్రకాశం జిల్లా, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, అన్నమయ్య జిల్లా, చిత్తూరు జిల్లా, తిరుపతి జిల్లాలకు ఆయన్ను నియమించారు. కనిగిరికి చెందిన వైఎం.ప్రసాద్‌రెడ్డి దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ కోఆర్డినేటర్‌గా పనిచేశారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా పనిచేశారు. 2001 సంవత్సరంలో జెడ్పీటీసీ గా గెలుపొందారు. వైఎస్ రాజశేఖరరెడ్డి పాదయాత్రలో చురుకుగా పాల్గొన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓదార్పుయాత్ర నుంచి ఆయన వెంటే నడిచారు. వైఎం.ప్రసాద్‌రెడ్డి భార్య యెనుముల సరిత ఏఎంసీ చైర్మన్ గా పనిచేశారు. డీసీసీబీ చైర్మన్ గా వై.ఎం.ప్రసాద్‌రెడ్డి పనిచేశారు. తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రసాద్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రైతుల తరపున పోరాడి పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని తెలిపారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శుల నియామకం

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా (ఒంగోలు పార్లమెంట్) కేవీ రమణారెడ్డి, వై వెంకటేశ్వరరావు, బొట్లరామారావు, కసుకుర్తి ఆదెన్నలను నియమించినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది. కేవీ రమణారెడ్డికి గిద్దలూరు, యర్రగొండపాలెం, వై వెంకటేశ్వరరావుకు ఒంగోలు, కొండపి, బొట్ల రామారావుకు దర్శి, సంతనూతలపాడు, కసుకుర్తి ఆదెన్నకు కనిగిరి, మార్కాపురం నియోజకవర్గాలు కేటాయించారు. వీరు కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ రీజినల్ కోఆర్డినేటర్, పార్లమెంట్ పరిశీలకులకు సహాయకారిగా వ్యవహరిస్తారని పేర్కొంది.

రూ.1.60 లక్షల ఎరువులు సీజ్



రికార్డులు తనిఖీ చేస్తున్న ఏఓ బుజ్జిబాయి

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని షణ్ముఖ ట్రేడర్స్‌లో అనుమతిలేకుండా విక్రయానికి సిద్ధంగా ఉన్న 10–26–26 రకం 89 బ్యాగుల ఎరువుల అమ్మకాలను నిలిపివేసినట్లు మార్కాపురం ఏఓ బుజ్జిబాయి తెలిపారు. దీని విలువ రూ.1,60,200 అని ఆమె తెలిపారు. ఎవరైనా వ్యాపారులు అనుమతిలేకుండా ఎరువులు విక్రయిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు.


12న జెడ్పీ సర్వసభ్య సమావేశం

ఒంగోలు సిటీ: జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 12వ తేదీ శుక్రవారం ఉదయం 10.30 గంటలకు పాత జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరం (సౌత్ బైపాస్‌రోడ్డు)లో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ చిరంజీవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

12న విద్యార్థులకు పరుగు పందెం

ఒంగోలు: హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణ అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం, వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా క్రీడాశాఖ, రెడ్ రిబ్బన్ క్లబ్ సంయుక్తంగా 17 నుంచి 25 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన విద్యార్థులకు 5 కిలోమీటర్ల పరుగుపందెం (మారథాన్) నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధిశాఖ అధికారి జి.రాజరాజేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు పురుషులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్ విభాగాలకు వేర్వేరుగా జరుగుతాయి. ఒక్కో విభాగంలో ప్రథమ విజేతకు రూ.10 వేలు, ద్వితీయ విజేతకు రూ.7 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేస్తారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 12న ఉదయం 6 గంటలకు స్థానిక కలెక్టరేట్ వద్ద తమ కాలేజీ ఐడీ కార్డుతో హాజరుకావాల్సి ఉంటుంది. వివరాలను ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సెల్ నంబర్: 9493554212 కు కాల్ చేయవచ్చు.

ప్రైవేటు జపం.. కలకలం..!



నిర్మాణం నిలిచిపోయిన మార్కాపురం మెడికల్ కాలేజీ భవనాలు

పశ్చిమ ప్రకాశం వాసులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు కావాలన్న కల ఏడు దశాబ్దాలనాటిది. ఆ కలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నెరవేర్చే దిశగా అడుగులు వేసింది. గతేడాది అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం కాలరాసేసింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న వైద్యకళాశాల నిర్మాణ పనులను నిలిపేసింది. గతేడాది మొదటి సంవత్సరం అడ్మిషన్లను అడ్డుకుంది. తాజాగా ఈ కళాశాలను పీపీపీ (పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్) విధానంలో నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడంపై పశ్చిమ వాసులు మండిపడుతున్నారు. దాదాపు పది లక్షల మంది ప్రజల ఆశలపై చంద్రబాబు నీళ్లు జల్లారని మండిపడుతున్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలను నిర్మించినట్లయితే పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందేవి. ప్రైవేటు పరం చేయడం వలన ప్రతి సేవకు ఫీజు చెల్లించాల్సి వస్తుంది. ప్రైవేటు యాజమాన్యం లాభం గురించే ఆలోచిస్తుంది. అందరికీ సమానమైన వైద్యసేవలు అందుబాటులోకి రావడం కష్టం. సామాన్య, పేద, దిగువ మధ్య తరగతి విద్యార్థులు ర్యాంకులు సాధించినా భారీ ఫీజులు చెల్లించుకోలేక వైద్య విద్యకు దూరమయ్యే పరిస్థితి దాపురించిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- మార్కాపురం మెడికల్ కళాశాలను ప్రైవేటుకు అప్పగింతపై ఆగ్రహం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 75 శాతం పనులు పూర్తి
- సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలందించే దిశగా అడుగులు
- మార్కాపురం జీజీహెచ్‌కు కొత్త హంగులు
- పశ్చిమంలో పది లక్షల మందికి అత్యుత్తమ వైద్యం అందకుండా కుట్ర
- పేదింటి బిడ్డలకు మెడికల్ విద్యను దూరం చేసిన ప్రభుత్వం
- చంద్రబాబు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

మార్కాపురం:

మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల్లో ప్రజలు చిన్నపాటి జ్వరం వచ్చినా అటు నెల్లూరు, నంద్యాల, కర్నూలుకు ఇటు గుంటూరు, విజయవాడలకు పరిగెత్తాల్సి వచ్చేంది. ఈ పరిస్థితిని మార్చేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంకణం కట్టుకున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మార్కాపురంలో మెడికల్ కళాశాల నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. రూ.475 కోట్లు నిధులు విడుదలచేశారు. మార్కాపురం మండలం రాయవరం వద్ద 41.97 ఎకరాల విస్తీర్ణంలో కాలేజీ మంజూరు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో దాదాపు 75 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. సిబ్బంది క్వార్టర్స్, నర్సింగ్ కళాశాల, జంట్స్, లేడీస్ హాస్టల్స్, సెంట్రల్ క్యాంటీన్ పూర్తిచేశారు. విద్యుత్ వైరింగ్, ప్లంబింగ్, రంగులతోపాటు కొన్ని భవనాల నిర్మాణాలు మాత్రమే పూర్తి చేయాల్సి ఉంది. ఇదే సమయంలో స్థానిక గుండ్లకమ్మ వద్ద ఉన్న జిల్లా వైద్యశాలను జీజీహెచ్‌గా మార్చి 450 బెడ్లను సిద్ధం చేశారు. ఇందులో జనరల్ సర్జరీ కోసం 100, జనరల్ మెడిసిన్ కోసం 100, ఆర్థోపెడిక్ విభాగానికి 40, ఆప్తమాలజీ 20, డెర్మటాలజీ 10, సైక్రియాట్రిక్ విభాగానికి 10, ఈఎన్‌టీకి 20, ఐసీయూ 20, పీడియాట్రిక్స్ 50, గైనకాలజీకి 50 బెడ్లు కేటాయించారు. ఇలా మార్కాపురం జీజీహెచ్ రూపురేఖలు మార్చేశారు. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకున్నారు. దాదాపు 75 మంది వైద్యులను నియమించారు. ఒక వైపు కళాశాల జోరుగా పనులు మరో వైపు జీజీహెచ్‌లో అభివృద్ధి జరుగుతుంటే పశ్చిమ ప్రకాశం వాసుల వైద్య కష్టాలు తీరినట్టేనని దాదాపు పది లక్షల మంది ప్రజలు సంబరపడ్డారు. 2024 విద్యా సంవత్సరం నుంచే 150 మంది విద్యార్థులతో ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభమయ్యేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితులన్నీ తలకిందులయ్యాయి. తమకు అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని, తమ పిల్లలు ఇక్కడే ఎంబీబీఎస్ సీట్లు తెచ్చుకుని డాక్టర్లు అవుతారని కన్న కలలన్నీ కల్లలయ్యాయి.



దాదాపు పూర్తయిన మెడికల్ కాలేజీలోని ఓ భవనం

పశ్చిమంపై బాబు కపట ప్రేమ:

ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత మార్కాపురం మెడికల్ కళాశాలకు గడ్డు రోజులు మొదలయ్యాయి. ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో మార్కాపురం మెడికల్ కాలేజీని చేర్చకుండా తీరని నష్టం చేశారు. గత ఏడాది, ఈ ఏడాది నీట్ కౌన్సెలింగ్‌లో మార్కాపురం మెడికల్ కాలేజీని చేర్చలేదు. ఫలితంగా 300 మెడికల్ సీట్లు నష్టపోవాల్సి వచ్చింది. ఇక్కడ నియమించిన వైద్యులను నిబంధనలకు వ్యతిరేకంగా అడ్డగోలుగా బదిలీ చేశారు. అంతటితో ఆగలేదు. అప్పటి వరకూ 75 మంది వైద్యులు ఉండగా అధికారంలోకి వచ్చిన వెంటనే 50 మందిని ఇతర ప్రాంత వైద్యశాలలకు బదిలీ చేశారు. ఫలితంగా పశ్చిమ ప్రకాశం ప్రజలకు 2014– 2019 మధ్య నాటి గడ్డురోజులు మళ్లీ ప్రారంభమయ్యాయి. ప్రాణం మీదకు వస్తే అటు గుంటూరు, ఇటు ఒంగోలు, కర్నూలుకు పరుగులు పెట్టాల్సిన దయనీయ పరిస్థితులు ఏర్పడ్డాయి. పుల్లలచెరువు, యర్రగొండపాలెం, కొమరోలు, గిద్దలూరు, పెద్దారవీడు, అర్ధవీడు, పెద్దదోర్నాల, రాచర్ల మండలాల్లో సుమారు 72 చెంచుగూడేలు ఉన్నాయి. ఇక్కడ వేలాది మంది గిరిజనులు నివాసముంటున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో గిరిజనులందరికీ ఇక్కడే మంచి వైద్యసేవలు అందాయి. ఇప్పుడు వైద్యులు లేకపోవడంతో నామమాత్రపు వైద్యసేవలు లభిస్తున్నాయి.

పీపీపీతో ఇబ్బందులే..

ప్రభుత్వమే వైద్యశాల నిర్మాణం చేపట్టి వైద్యులను నియమిస్తే ఈ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా లభిస్తుంది. పీపీపీ వలన వైద్యశాల నిర్వహణతో పాటు వైద్య విద్య సీట్లు కూడా ప్రైవేటు మేనేజ్‌మెంటులో ఉంటాయి. దీంతో సాధారణ ప్రజలకు వైద్యం కావాలంటే డబ్బు చెల్లించాల్సిందే. కార్పొరేట్ వైద్యసేవలు కావాలంటే మరికొంత డబ్బు చెల్లించాల్సిందే. ఫీజులు చెల్లించే కొద్దీ ప్రైవేటు వైద్యశాలలోలాగా ఇక్కడ కూడా వైద్యసేవలు అందుతాయి. ప్రభుత్వ ఆధిపత్యం, వైద్యశాల, మెడికల్ కళాశాలపై తగ్గుతుంది. ఆధునిక టెక్నాలజీ అందుబాటులోనికి వచ్చినా చికిత్స ఖర్చుల భారం ప్రజలపై పడుతుంది.

పశ్చిమ ప్రకాశంలో నియోజకవర్గాలు:	4
మండలాలు:	20
పశ్చిమ నియోజకవర్గాల ప్రజలు:	10 లక్షలు (సుమారు)
చెంచుగూడేలు:	72

కార్పొరేట్లకు అప్పగిస్తే నష్టమే



మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విచారకరం. ప్రభుత్వ నిర్వహణలో ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. అదే కార్పొరేట్లకు అప్పగించడం వలన సామాన్య నిరుపేద ప్రజలకు వైద్య సేవలు భారమవుతాయి. ప్రభుత్వ వైద్య కళాశాలగా కొనసాగితే మెరిట్ విద్యార్థులకు మాత్రమే సీట్లు వస్తాయి. లేకపోతే మేనేజ్‌మెంట్ కోటా పేరుతో సీట్లను అమ్ముకునే అవకాశాలు ఉంటాయి. ఎటు చూసినా ప్రైవేటు కళాశాల వలన ప్రజలకు నష్టమే తప్ప ప్రయోజనం ఏమీ ఉండదు.

– డా.అజయ్ కుమార్ రెడ్డి, జీజీహెచ్, ఒంగోలు

డాక్టర్ కలను నాశనం చేసిన బాబు



ఎంబీబీఎస్ చదివి గొప్ప డాక్టర్లు అవ్వాలనే పేద విద్యార్థుల కలలను సీఎం చంద్రబాబు నాశనం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్య విద్యను నిర్వీర్యం చేసింది. విద్యా, వైద్యం అందరికీ అందాలనే లక్ష్యంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 17 ప్రభుత్వ వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టింది. వైద్య పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య తోపాటు, పేద ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవ లందించాలన్న లక్ష్యంగా కళాశాల నిర్మాణాలను వేగవంతం చేశారు. అయితే చంద్రబాబు వాటిని ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయడం సరికాదు. కొన్ని వేల మంది విద్యార్థులు డాక్టర్ కావాలనే ఆశలు ఆడియాశలయ్యాయి.

– నందకిషోర్, వైఎస్సార్ సీపీ డాక్టర్స్ వింగ్ జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించడం తగదు



పేద, బడుగు వర్గాల విద్యార్థులకు వైద్య విద్యను దరిచేర్చేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాలేజీలను నిర్మించి అందులో 5 కాలేజీలను ప్రారంభిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ 17 మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటు పరం చేయటానికి పూనుకొని పేద, బడుగు విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లటం దారుణం. మరో 7 మెడికల్ కాలేజీలు కూడా ప్రారంభదశలో ఉన్నాయి. కూటమి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వలన గత సంవత్సరం 750 మంది విద్యార్థులు ప్రభుత్వ కాలేజీల్లో మెడికల్ సీట్లు కోల్పోవాల్సి వచ్చింది.

– డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు

ఇలా అయితే కష్టమే



పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలను ప్రభుత్వం కట్టాలనే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి. ఇలా కట్టడం వలన చికిత్స కోసం వైద్యశాలకు వెళ్లే రోగులు ఫీజులు చెల్లించాలి. దీని వలన ప్రజలపై భారం పడుతుంది. ఉపయోగం లేదు. ప్రజారోగ్యాన్ని ప్రభుత్వమే బాధ్యతగా తీసుకుని కాలేజీ నిర్మాణాన్ని ప్రభుత్వమే కట్టాలి.

– అందె నాసరయ్య, సీపీఐ రాష్ట్ర నాయకుడు

ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందాలి



పేద ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మెడికల్ కాలేజీని ప్రభుత్వమే కట్టింది. 75 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన 25 శాతం పనుల కోసం ప్రభుత్వం పీపీపీ విధానాన్ని అమలు చేయాలని అనుకోవడం బాధాకరం. ప్రభుత్వమే మెడికల్ కళాశాల కట్టాలి.

– గొలమారి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ కార్యదర్శి, మార్కాపురం

ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



మార్కాపురం మండలం రాయవరం వద్ద గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన మెడికల్ కళాశాలను పీపీపీ విధానంలో కాకుండా ప్రభుత్వమే నిర్మాణం చేపట్టాలి. పీపీపీ వలన ప్రజలపై ఆర్థిక భారం పడుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పీపీపీ విధానాన్ని ఉపసంహరించుకోవాలి.

– షేక్ సలీం, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు, మార్కాపురం

అమెరికా సుంకాలపై నోరు మెదపని మోదీ



అమెరికా టారిఫ్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

- టారిఫ్‌లను వ్యతిరేకిస్తూ వామపక్షాల నిరసన

ఒంగోలు టౌన్: అమెరికా విధిస్తున్న 50 శాతాల సుంకాలపై ప్రధాని మోదీ నోరుమెదపకపోవడం సిగ్గుచేటని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ విమర్శించారు. రష్యా నుంచి ఆయిల్ దిగుమతిపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆంక్షలు విధించడం, బెదిరింపులకు తెగబడుతున్నప్పటికీ మోదీ మౌనంగా ఉండటాన్ని దేశ ప్రజలు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. అమెరికా విధిస్తున్న సుంకాలకు వ్యతిరేకంగా నగరంలోని ఆర్టీసీ డిపో వద్ద సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్, సీపీఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ అప్పుల కుప్పగా మారిన అమెరికా ఆర్థిక వ్యవస్థను కాపాడుకునేందుకు ప్రపంచ దేశాలపై సుంకాల పేరుతో వాణిజ్య యుద్ధానికి దిగిందని చెప్పారు. అమెరికా సుంకాలతో భారత దేశం ఆర్థిక వ్యవస్థ మీద తీవ్రమైన ప్రభావం పడిందన్నారు. ఆక్వా రంగంతోపాటుగా ఆహార ఉత్పత్తులు, వస్త్రాల ఎగుమతులు నిలిచిపోయాయని, రైతులు, పారిశ్రామికవేత్తలు సంక్షోభంలో పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు మాట్లాడుతూ రొయ్యల ఎగుమతిపై సుంకాలు పెంచడంతో ఎగుమతులు నిలిచిపోయాయని చెప్పారు. దేశ అంతర్గత వ్యవహారాల్లో ట్రంప్ మితిమీరిన జోక్యం చేసుకుంటున్నారని, దీని వల్ల దేశ సార్వభౌమాధికారానికి భంగం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సీపీఎంఎల్ నాయకురాలు లలిత కుమారి మాట్లాడుతూ ట్రంప్ టారిఫ్‌ల కారణంగా వ్యవసాయరంగం సామ్రాజ్యవాదుల హస్తగతమయ్యే ప్రమాదం నెలకొందన్నారు. సీపీఎంఎల్ న్యూ డెమోక్రసి నాయకుడు సాగర్ మాట్లాడుతూ ప్రపంచ పోలీసు అమెరికా వాణిజ్య యుద్ధానికి దిగిందని, ప్రజలంతా ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. నిరసన కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు జీవీ కొండారెడ్డి, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, కాలం సుబ్బారావు, కంకణాల రమాదేవి, ఆదిలక్ష్మి, బాలకోటయ్య, కేఎఫ్ బాబు, బంకా సుబ్బారావు, సీహెచ్ వినోద్, శ్రీరాం శ్రీనివాస్, ఎంఏ సాలార్, ఎల్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత పోరు వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



అన్నదాత పోరు వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 9వ తేదీన తలపెట్టిన అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ పోరు వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ శనివారం నియోజకవర్గానికి చెందిన ఐటీ వింగ్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. రైతుల పక్షన నిలబడి పోరుకు పిలుపునిచ్చిన జగనన్నకు తమ అండదండలు ఉంటాయని, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు దొండేటి నాగేశ్వరరెడ్డి, నియోజకవర్గ విభాగం అధ్యక్షుడు దుద్యాల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకుడు అల్లు సదాశివారెడ్డి, యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాల ఐటీ వింగ్ అధ్యక్షులు కందుల వెంకటసుబ్బారెడ్డి, పతంగి అంజిరెడ్డి, కొల్లి నాగేశ్వరరెడ్డి, మూల హర్షవర్ధన్‌రెడ్డి, వెన్నా కాశీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రాకెట్ బాల్ రాష్ట్ర జట్లు ఇవే



రాష్ట్ర స్థాయి బాలికల జట్టు



రాష్ట్ర స్థాయి బాలుర జట్టు

ఒంగోలు: రాకెట్ బాల్ రాష్ట్ర స్థాయి బాలబాలికల జట్ల ఎంపిక శనివారం స్థానిక హైదరాబాద్ పబ్లిక్ స్కూలు ఆవరణలో నిర్వహించారు. అండర్ 19 బాలబాలికలు పెద్ద ఎత్తున ఈ పోటీల్లో పాల్గొన్నారు. వారికి ప్రతిభా పోటీలు నిర్వహించి తుది జట్లను ఎంపిక చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు అన్వర్ బాషా, జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను ఉద్దేశించి హైదరాబాద్ పబ్లిక్ స్కూలు కరస్పాండెంట్ జగదీష్ మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్ర కీర్తిప్రతిష్టలు ఇనుమడింపజేయాలన్నారు.

బాలుర జట్టు:

వరుణ్, ఒత్నీల్, దిలీప్, సాత్విక్, సంజయ్ కార్తీక్, లాక్షిత్, అక్షయ్, హనీష్, పునీత్, సాత్విక్, శ్రీకాంత్.

బాలికల జట్టు:

గాయత్రి, సహస్ర, పూర్వి, సాహిత్య, పూజ, షాహీన, ధన్విత, అర్చన, లోహిత, మనీషా.

రూ. లక్ష పలికిన గణేష్ లడ్డు

యర్రగొండపాలెం: వినాయక చవితి సందర్భంగా స్థానిక కొలుకుల సెంటర్‌లో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహాన్ని శనివారం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కోలాటం, భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మహిళలు పల్లకి సేవలో పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. ముందుగా 9 రోజుల పాటు పూజ కార్యక్రమాల్లో స్వామి ఎదుట ఉంచిన లడ్డూ ప్రసాదం, కలశంలతోపాటు వివిధ వస్తువులను నిర్వాహకులు వేలం నిర్వహించారు. ఈ వేలంలో లడ్డూ ప్రసాదం రూ 1. లక్షకు కొత్త హరిబాబు దక్కించుకున్నాడు. కైపు వెంకటరెడ్డి కలశం వేలంలో పాల్గొని రూ.90 వేలకు సొంతం చేసుకున్నారు. అకౌంట్ బుక్స్ రూ.90 వేలకు ఆవుల బాలిరెడ్డి, పెన్ను రూ.18 వేలకు చెంగళ నాగయ్య పాడుకున్నారు. కొలుకుల సెంటర్ నుంచి బస్టాండ్, పోలీస్ స్టేషన్, మండల రెవెన్యూ కార్యాలయంల మీదుగా త్రిపురాంతకంలో ఉన్న నాగార్జున సాగర్ కాలువ వద్దకు వినాయకుడిని తరలించి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాఛనీయ సంఘటనలు, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సీఐ సీహెచ్ ప్రభాకరరావు ఆధ్వర్యంలో పోలీసులు శాంతిభద్రతలను కాపాడారు.



లడ్డూ ప్రసాదంతో హరిబాబు

క్లుప్తంగా

పాఠశాలకు అని చెప్పి.. రైలులో వెళ్లిన రెండో తరగతి విద్యార్థి

మార్కాపురం: పాఠశాలకు వెళ్తున్నానని చెప్పిన రెండో తరగతి విద్యార్థి నేరుగా రైల్వేస్టేషన్‌కు చేరుకుని రైలు ఎక్కి వెళ్లిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. మార్కాపురం పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న బాలుడు శనివారం మధ్యాహ్నం భోజనానికి పాఠశాల నుంచి ఇంటికొచ్చాడు. ఇంట్లో భోజనం చేసిన అనంతరం పాఠశాలకు వెళ్తున్నానని చెప్పి పాఠశాలకు వెళ్లకుండా మార్కాపురం రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. ఆ సమయంలో వచ్చిన రైలు ఎక్కి గిద్దలూరు రైల్వేస్టేషన్‌లో దిగాడు. అక్కడ అనుమానాస్పదంగా ఉన్న బాలుడిని చూసిన రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. వివరాలు తెలుసుకుని మార్కాపురంలోని బాలుడి తల్లిదండ్రులకు, పాఠశాల యాజమాన్యానికి సమాచారం ఇవ్వడంతో వారు గిద్దలూరు వెళ్లి బాలుడిని తీసుకొచ్చారు.

పెళ్లికి నిరాకరించారని యువకుడు ఆత్మహత్య



మృతిచెందిన పెద్దనరసింహులు

కొమరోలు: పెళ్లికి నిరాకరించారనే కారణంతో క్షణికావేశంలో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కొమరోలు మండలంలోని గుండ్రెడ్డిపల్లె గ్రామంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గుండ్రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పాలదాగి పెద్దనరసింహులు (24) తల్లిదండ్రులు అతని మేనమామ కూతురినిచ్చి పెళ్లిచేయాలనే ఉద్దేశంతో వారింటికి వెళ్లి అడిగారు. కానీ, వారు పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపానికి గురైన పెద్దనరసింహులు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు దుప్పటితో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై నాగరాజు తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చేతికందివచ్చిన కుమారుడి మృతితో తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వాహనం ఢీకొని ఎనిమిది గేదెలు మృతి



సీఎస్ పురం (పామూరు): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఎనిమిది గేదెలు మృతిచెందిన సంఘటన శనివారం వేకువజామున 167బీ జాతీయ రహదారిపై సీఎస్ పురం మండలంలోని కోవిలంపాడు – కంభంపాడు గ్రామాల మధ్య చోటుచేసుకుంది. వాటి విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుంది. అయితే, ఈ సంఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇంకా ఫిర్యాదు అందలేదు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బేస్తవారిపేట: జాతీయ రహదారిపై స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో శనివారం ఎదురెదురుగా రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. బేస్తవారిపేటలోని టైలర్స్‌కాలనీకి చెందిన కత్తి వేణుగోపాల్ పిల్లలను స్థానిక జంక్షన్‌లోని స్కూల్‌లో వదిలిపెట్టి బేస్తవారిపేట వైపునకు స్కూటీపై వెళ్తున్నాడు. ఒందుట్లకు చెందిన నాగూరు మీరావలి జంక్షన్ వైపు వెళ్తుండగా, ఈ రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వేణుగోపాల్ తలకు తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. నాగూర్‌మీరావలి స్వల్పంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్సై రవీంద్రారెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. వేణుగోపాల్ పరిస్థితి విషమంగా ఉండటంతో పోలీస్ వాహనంలో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు గిద్దలూరు తీసుకెళ్లారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దుర్మార్గం

● వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్



కనిగిరి రూరల్: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా మండిపడ్డారు. అపార అనుభవం ఉందని చెప్పుకునే సీఎం చంద్రబాబు తన 15 ఏళ్ల పాలనలో ఒక్క ప్రభుత్వ మెడికల్ కాలేజీ అయినా నిర్మించారా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నిరంగాలను ప్రైవేటీకరణ చేస్తోందని తీవ్రంగా దుయ్యబట్టారు. కమీషన్ల కోసమే 10 మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరణ చేసేందుకు క్యాబినేట్ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. ఈ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవాడికి ఆరోగ్య భద్రత కల్పించాలని, పేదలకు వైద్యం చేరువ చేయాలనే ఉన్నత లక్ష్యంతో రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు నిర్మించి అనుమతులు మంజూరు చేయించినట్లు తెలిపారు. జగన్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందనే అక్కసుతోనే కూటమి సర్కారు కుట్రతో మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తున్నట్లు ఆరోపించారు. జిల్లాలోని మార్కాపురంలో ఉన్న మెడికల్ కాలేజీ పనులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినా నత్తనడకన సాగుతున్నాయన్నారు. చంద్రబాబు కేవలం వెయ్యి ఆస్పత్రుల్లో మాత్రమే ఆరోగ్య శ్రీ పథకం అమలు చేస్తే.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 2,350 ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ ద్వారా వైద్యం అందించినట్లు వివరించారు. జగనన్న ప్రభుత్వంలో 45 లక్షల మంది లబ్ధిదారులకు రూ.13 వేల కోట్లు వెచ్చించి వైద్యం, రూ.1,500 కోట్లతో ఆర్థిక ఆసరా అందించారని వివరించారు. చంద్రబాబు ప్రభుత్వంలో ఆరోగ్య శ్రీలో రూ.5 లక్షల వరకు మాత్రమే లబ్ధి ఉండేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆ లబ్ధిని రూ.25 లక్షలకు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. వైద్య విద్యను పేదలకు దూరం చేయాలనే దురుద్దేశంతోనే ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తోందని ఆరోపించారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కు తీసుకోవాలని దద్దాల నారాయణ యాదవ్ డిమాండ్ చేశారు.

మెడికల్ కళాశాలలపై ప్రభుత్వ నిర్ణయం బాధాకరం

● వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.రమణారెడ్డి



ఒంగోలు సిటీ: రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న 12 మెడికల్ కళాశాలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తూ కూటమి ప్రభుత్వం ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం అత్యంత దుర్మార్గమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.రమణారెడ్డి తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రానికి నాలుగుసార్లు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు ఒక్క ప్రభుత్వ మెడికల్ కళాశాల కూడా స్థాపించలేదని, కేవలం 5 సంవత్సరాలు మాత్రమే ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎవరూ చేయని విధంగా ఒక్కసారిగా 17 మెడికల్ కళాశాలలకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారని వివరించారు. గత ఎన్నికల సమయానికి 5 కళాశాలు పూర్తి చేసి రాష్ట్రంలోని పేద విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించడమే కాకుండా పేద ప్రజలకు ఉచిత వైద్యం కల్పించారన్నారు. అబద్ధపు హామీలతో చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దాదాపు 70 శాతం పనులు పూర్తయి అందుబాటులోకి తీసుకురావడానికి సిద్ధంగా ఉన్న మిగిలిన 12 కళాశాలను పీపీపీ ముసుగులో భారీగా కమీషన్లకు కక్కుర్తిపడి దొడ్డిదారిన బినామీదార్లకు కట్టబెట్టడం వలన పేదలకు ఉచితంగా వైద్య విద్యతో పాటు వైద్యాన్ని కూడా దూరం చేయడం అన్యాయమన్నారు. వైద్య కళాశాలలన్నీ చంద్రబాబు అనుచరుల కబంధ హస్తాలలో ఉన్నాయని, ఈ 12 కళాశాలలు కూడా టీడీపీ అనుచరుల చేతుల్లోకి పోతే వైద్య విద్యలో టీడీపీ మాఫియా పేట్రేగిపోయే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయంతో వెనుకబడిన, జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్న మార్కాపురం డివిజన్లో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన మెడికల్ కళాశాల కూడా ప్రైవేటు పరమై సరైన వైద్యం అందించే హాస్పిటల్ లేక దూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం కొనుక్కోవాల్సిన దుస్థితిలోకి వెళ్తుందన్నారు. ఇప్పటికైనా ఆ ప్రాంత ప్రజల అభిష్టాన్ని గౌరవించి తక్షణమే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో చరిత్ర హీనులుగా మిగిలిపోతారని అన్నారు.

రైతులకు బాసటగా నిలుద్దాం



అన్నదాత పోరు పోస్టర్లు ఆవిష్కస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, వైఎస్సార్ సీపీ నాయకులు

● అన్నదాత పోరు కార్యక్రమం పోస్టర్లు ఆవిష్కరించిన మాజీ మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపాడు: రాష్ట్రంలోని రైతులకు బాసటగా నిలిచేందుకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ ఆర్డీఓ కార్యాలయాల వద్ద చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున పిలుపునిచ్చారు. మద్దిపాడు మండల కేంద్రం సమీపంలోని ఘడియపూడి కాలనీలో పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. చంద్రబాబు సీఎం అయిన ప్రతిసారీ రైతులు, మహిళలు మోసానికి గురవుతున్నారని గుర్తు చేశారు. రైతులకు బాసటగా నిలిచేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు కదలిరావాలన్నారు. యూరియాతో సహా ఇతర ఎరువులు వెంటనే పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఎరువులను పక్కదోవ పట్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని, అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని మేరుగు నాగార్జున డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ నియోజకవర్గ నాయకులతో కలిసి అన్నదాత పోరు పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు వాకా కోటిరెడ్డి, నాయకులు పల్లపాటి అన్వేష్, పైనం శ్రీనివాసరావు, కంకణాల సురేష్, సన్నపురెడ్డి రమణమ్మ, కాకర్లపూడి రజని, మండవ బాలచంద్రమౌళి, మంద ప్రసాద్, రాయపాటి విల్సన్, కావూరి ఏసేబు, దాకా రాజీవ్‌రెడ్డి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాస్ అక్షర ఆంధ్రపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ-2 అచ్యుత సుబ్బారావు

తర్లుపాడు: ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛంద ఉపాధ్యాయులకు స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ-2 అచ్యుత సుబ్బారావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అక్షరాస్యత అవసరాన్ని స్వచ్ఛంద ఉపాధ్యాయులకు ఆయన వివరించారు. అవసరమైన పాఠశాలల్లో స్వచ్ఛంద ఉపాధ్యాయులను వినియోగించుకుంటామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పర్యవేక్షకుడు వెంకటరెడ్డి అధికారులను కోరారు. ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత గురించి వారికి వివరించారు. నిరక్షరాస్యులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఏపీఎం రమేష్ ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో మహిళా సమైక్య సభ్యులు, వెలుగు, సీసీలు, వీఓఏలు, పాల్గొన్నారు.

ఉపాధ్యాయునిపై విచారణ



విచారిస్తున్న డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వరరావు, దినేష్‌కుమార్, ఇతర అధికారులు

మద్దిపాడు: మండలంలోని వెల్లంపల్లి పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు గోపనబోయిన రవికుమార్‌పై డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వరరావు, జిల్లా బాలికల సంరక్షణ అధికారి దినేష్‌కుమార్, ఇతర సిబ్బంది శనివారం విచారణ చేపట్టారు. మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులను విచారించారు. బంగారు బాల్యం కార్యక్రమంలో వెల్లంపల్లి ప్రాథమిక పాఠశాలలో చదివిన విద్యార్థులు కొందరు గోపనబోయిన రవికుమార్ తీరుపై అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో అతనిపై విచారణ నిర్వహించడానికి విద్యార్థినుల తల్లిదండ్రులను గోప్యంగా పిలిపించారు. ఐసీడీఎస్ మద్దిపాడు ప్రాజెక్టు సూపర్‌వైజర్లు ఆయా విద్యార్థినులను విచారించారు. విచారణ పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. విచారణలో ఒంగోలు ఎంఈఓ కిషోర్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరాజ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సులపై మెడికల్ ఆఫీసర్ల పెత్తనం



మాట్లాడుతున్న కాలం సుబ్బారావు

ఒంగోలు టౌన్: అర్బన్ వైద్యశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న స్టాఫ్ నర్సులపై మెడికల్ ఆఫీసర్లు పెత్తనం చలాయిస్తున్నారని, వైద్యారోగ్య శాఖ అధికారుల ఆదేశాలను లెక్కచేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్టాఫ్ నర్సులు ఆరోపించారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ ఎంప్లాయీస్ యూనియన్ సర్వసభ్య సమావేశాన్ని స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాఫ్ నర్సులు మాట్లాడుతూ ఆదివారాలు, పండుగ రోజులు కూడా పనిచేస్తున్నప్పటికీ డే ఆఫ్‌లు ఇవ్వకుండా వేధిస్తున్నారని, కొందరు మెడికల్ ఆఫీసర్లు ఉద్దేశపూర్వకంగా వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సమస్యలను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని యూనియన్ సభ్యులు, నాయకులు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు యూపీహెచ్‌సీల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, పదవీ విరమణ సౌకర్యాలు కల్పించాలని, ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనివేళలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా కె.హనుమంతరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏ సుధాకర్, కోశాధికారిగా షేక్ ఖాజావలి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అరుణ కుమారి, వైస్ ప్రెసిడెంట్లుగా జి.శ్రీనివాసరావు, నిర్మలకుమారి, వాసవి, కార్యదర్శులుగా సుభాషిణి, జి.రామారావు, కోట్రెజరర్‌గా ఆంజనేయులును ఎన్నుకున్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు తాళ్లూరి వెంకటేశ్వర్లు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.68 లక్షలకు మోసం చేయడంపై ఫిర్యాదు

మార్కాపురం:

ఒక ప్రభుత్వ ఉద్యోగి తనకు పొలం ఇప్పిస్తానని రూ.68 లక్షలు తీసుకున్నాడని, అనంతరం పొలం ఇప్పించకుండా, డబ్బులూ తిరిగివ్వకుండా అడిగితే దూషణకు పాల్పడుతూ ఇబ్బంది పెడుతున్నాడని, తనకు న్యాయం చేయాలని మార్కాపురం మండలం రాయవరం గ్రామానికి చెందిన పల్లెబోయిన పెద్దఆవులయ్య శనివారం మార్కాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మార్కాపురం పట్టణంలోని కోనేటి వీధిలో నివాసముండే సీహెచ్ శ్రీనివాసులు యర్రగొండపాలెం రెవెన్యూ కార్యాలయంలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడని, 2023లో మార్కాపురం నేషనల్ హైవే పక్కన 1.15 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ చేయిస్తానని తన వద్ద నుంచి 68 లక్షల రూపాయల నగదు తీసుకున్నాడని ఫిర్యాదులో ఆవులయ్య పేర్కొన్నారు.

అప్పటి నుంచి ఇప్పటివరకూ పొలం తనకు రిజిస్ట్రేషన్ చేయాలని, లేకుంటే తాను ఇచ్చిన డబ్బు తిరిగివ్వాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ క్రమంలో శనివారం శ్రీనివాసులు ఇంటికి వెళ్లి డబ్బులివ్వాలని, లేకుంటే పొలం

రిజిస్ట్రేషన్ చేయాలని అడిగితే దూషించడంతోపాటు మానసికంగా ఇబ్బంది పెట్టాడని, తనకు న్యాయం చేయాలని పేర్కొన్నాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● విద్యార్థినులతో ఐసీడీఎస్ పీడీ సువర్ణ

ఒంగోలు వన్‌టౌన్: విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ పీడీ సువర్ణ సూచించారు. ఒంగోలు భాగ్యనగర్‌లోని పరివర్తనా భవనంలో నిర్వహిస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల వసతి గృహాలు 1, 2, 3 విద్యార్థినులకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తి పథకం అమలులో భాగంగా శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, బాలికల ఆరోగ్యం, సాధికారత, సంక్షేమం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ విద్యార్థినులకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించేందుకు సెప్టెంబర్ 2 నుంచి 12వ తేదీ వరకూ ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సామాజికంగా యువతులకు ఎదురయ్యే సమస్యలను వివరించి వాటిని ఏ విధంగా ఎదుర్కోవాలి, ఎలా పరిష్కరించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో సఖీ సెంటర్ అడ్మిన్ జ్యోతి సుప్రియ, ఏఎస్సై వి.గౌతమి, హాస్టల్ వార్డెన్లు శ్రీలత, శిరీష, విద్యార్థినులు పాల్గొన్నారు.

పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలి



మాట్లాడుతున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

ఒంగోలు సిటీ:

ప్రభుత్వం వెంటనే స్పందించి పీఆర్సీ కమిటీని నియమించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఒంగోలులోని సర్వశిక్షాభియాన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 'టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఉద్యోగులకు సంబంధించిన పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు రావాల్సిన డీఏలు వెంటనే మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, గౌరి, హరికృష్ణ, చైతన్య, రవి, టౌన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఒంగోలు తాలూకా అధ్యక్షుడు సురేష్, సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకులు ప్రభాకర్, ఏసురత్నం, రంగారెడ్డి, శివశంకర్, గిరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

హిజ్రాలకు శిక్షణ కార్యక్రమాలు

ఒంగోలు వన్‌టౌన్: హిజ్రాలకు పోటీ పరీక్షలు, నైపుణ్య అభివృద్ధిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రా లు, వయోవృద్ధుల సంక్షేమశాఖ జిల్లా సహాయ సంచాలకులు సువార్త శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 21వ సెంచరీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ఆధ్వర్యంలో పూర్తి ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. రాష్ట్ర, జాతీయ స్థాయి ఐటీ, ఐటీఈఎస్ రంగాలలో ఉపాధి అవకాశాలు, భవిష్యత్తు ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు ఈ శిక్షణ కార్యక్రమాలు సహాయపడతాయన్నారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్/డిగ్రీ విద్యార్హత కలిగి ఉండాలన్నారు. ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలోని ఆసక్తి గల హిజ్రాలు సంబంధిత కార్యాలయం నుంచి దరఖాస్తులు పొంది పూర్తిచేసి తిరిగి అదే కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఇతర వివరాలకు 08592-281310 నంబర్‌ను కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని కోరారు.